
కుల సంఘాల ఓట్లకు అభ్యర్థుల పాట్లు

- పోటాపోటీగా ముమ్మర ప్రయత్నాలు
- జోరుగా సమావేశాలు, హామీల వర్షాలు
- కీలక మారిన ఉత్తరాది ఓటర్లు



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన పార్టీల అభ్యర్థులు కుల సంఘాలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీల పార్టీల అభ్యర్థులను ప్రకటించడంతో ఎన్నికల వేడి రాజుకుంది. మరో ప్రధాన పార్టీ మజ్లిస్ తన అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న బీసీ ఓటర్లను ప్రసన్నం చేసేందుకు నాయకులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ప్రధానంగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ తమ ముఖ్య నాయకులు, కుల సంఘాల పెద్దలతో సమావేశాలు నిర్వహించి వారిని తమ వైపు లాక్కునేందుకు పెద్దలతో ఒప్పందాలు చేయిస్తున్నారు. దీంతో నియోజకవర్గంలో అన్ని కుల సంఘాల ముఖ్య నాయకులు బీజీగా ఉన్నారు. ఆదివారం కావడంతో అన్ని పార్టీల నాయకులు కుల సంఘాలతో వేర్వేరుగా సమావేశాలను నిర్వహించారు. తమకే మద్దతు ఇవ్వాలంటూ కోరారు.

5.52 లక్షలకు పైగా ఓట్లు..

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 5.52 లక్షలకు పైగా ఓటర్లుగా నమోదై ఉన్నారు. వీరిలో అత్యధికంగా ముదిరాజ్, గౌడ, రెడ్డి, పద్మశాలి, కురుమ యాదవ తదితర కులస్తుల ఓట్లు అత్యధికంగా ఉన్నాయి. వీరితో పాటు ఉత్తరాది ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారు అత్యధికంగా ఉన్నారు. గెలుపు ఓటములను శాసించే స్థాయిలో కుల సంఘాల ఓట్లు ఉండటంతో ప్రాధాన్యం ఏర్పడింది. ప్రధాన పార్టీలు వారిని ప్రసన్నం చేసుకుంటునే తమ గెలుపు సులువుగా అవుతుందన్న అంచనాలతో తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. నియోజకవర్గంలో అన్ని కుల సంఘాలకు మండల స్థాయిలలో సంఘాలు ఉన్నాయి. పూర్తి కార్యవర్గ సభ్యులతో పాటు తమ ప్రాంతంలోని కులస్తులందరికి సభ్యత్వాలు అందించి మరింత ఉత్సాహపరిచారు. ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం ఈ సంఘాలు చురుకుగా పని చేస్తున్నాయి.

వీరే కీలకం..

నియోజకవర్గంలో ఉత్తరాది ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. ప్రస్తుతం ఈ ఓటర్లు పార్టీ అభ్యర్థుల గెలుపు ఓటములను ప్రభావితం చేసే స్థాయిలో కీలకంగా ఉన్నారు. ప్రధానంగా గండిపేట్, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాలలో వీరి సంఖ్య అధికంగా ఉంది. వీరిని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు ప్రయత్నాలను చేస్తున్నారు. ఇప్పటికే మూడు పార్టీల అభ్యర్థులు వీరితో సమావేశాలను నిర్వహించడంతో పాటు కొందరిని పార్టీలోకి ఆహ్వానించారు. బస్తీలు, కాలనీల వారీగా వీరిని పార్టీలోకి చేర్చుకుంటున్నారు.

పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా మనోజ్



శంషాబాద్: శంషాబాద్ పట్టణ (ఓల్డ్ శంషాబాద్) ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా బొబ్బిలి మనోజ్ ముదిరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఆకట్టుకున్న స్వర్ దీపావళి

గచ్చిబౌలి: మహారాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నిర్వహించిన స్వర్ దీపావళి సంగీత కచేరీ అందరినీ ఆకట్టుకుంది. ఆదివారం ఉదయం కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో తత్వఆర్ట్స్, కేశవ్ మెమోరియల్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్‌లు సంయుక్తంగా దీపావళి హట్- స్వర్ దీపావళి పేరిట సంగీత కచేరీ నిర్వహించారు.


సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఆదివారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కిస్మత్‌పూర్‌లోని మాజీ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ ఇంట్లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టలేదని నియోజకవర్గంలో చేసిన అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజల్లోకి వెళ్లి పార్టీ శ్రేణులు ఎప్పటికప్పుడు ప్రజా సంక్షేమ పథకాలను వివరించి వారిని చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహేందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్, పార్టీ అధ్యక్షుడు గోకరి సురేష్‌గౌడ్ నాయకులు నాగరాజ్, జగదీశ్వర్‌గౌడ్, నవాజ్ మున్‌తాజ్, సదానంద్, మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

అడిగి పనులు చేయించుకోవాలి..



మణికొండ: గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లలో ఉన్న ప్రజలు వారికి ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకుని వస్తే వెంటనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శనివారం రాత్రి ఆయన మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల సరిహద్దు అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఉన్న ఆనంద పోయెట్రీ గేటెడ్ కమ్యూనిటీలో నీలేష్‌ప్రసాద్ దూబే నివాసితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనుదినం ప్రజల్లో ఉండి తన దృష్టికి వచ్చిన సమస్యలన్నింటినీ పరిష్కరించే తనను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గేటెడ్ కమ్యూనిటీలలోనూ సమస్యలు ఉంటాయని, వాటిని ఎప్పటికపుడు తన దృష్టికి తీసుకుని రావాలని, ఇదే ఆనంద పొయెట్రీకి రోడ్డు, తాగు నీటి సౌకర్యాలను అడిగితే వెంటనే చేయించామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జి.వెంకటేష్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్ ఎ.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి



మణికొండ: రెడీమిక్స్ కాంక్రీట్ ప్లాంట్‌లో మృతి చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని సీపీఐ పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్‌రావు హెచ్చరించారు. ఆదివారం ఆయన తమ పార్టీ నాయకులతో కలిసి ప్రమాదం జరిగిన ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెడీ మిక్స్ ప్లాంట్ నిర్వాహకులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవటం, నిర్లక్ష్యంగా పనిచేసే ఆపరేటర్‌ను ఏర్పాటు చేసుకోవటంతోనే ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి నష్ట పరిహారంగా రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రామస్వామి, జిల్లా కార్యదర్శులు ఎస్. మల్లేష్, జైపాల్‌రెడ్డి, దత్తు నాయక్, కార్యవర్గ సభ్యులు శంకరయ్య, మండల కార్యదర్శి స్వామి, సీపీఐ మండల కార్యదర్శి బాబురావు పాల్గొన్నారు.

బుద్వేల్‌లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న నరేందర్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ పార్టీ సీనియర్ నాయకుడు కోరని శ్యామ్‌తో కలిసి ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అంతకుముందు ఆయన బుద్వేల్ కట్ట మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానికంగా ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికి రావాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని వివరించారు. ఇందిరమ్మ రాజ్యం కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. ప్రచారంలో కోరని బాలరాజ్, కోరని మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్ పరిధిలో...

అత్తాపూర్: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందని రాజేంద్రనగర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కొండక్కల్ల నాగేందర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్ ముదిరాజ్ విజయాన్ని కాంక్షిస్తూ అత్తాపూర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ గత 30 ఏళ్లుగా స్థానిక సర్పంచ్‌గా మణికొండ మున్సిపల్ చైర్మన్‌గా ప్రజల్లో మంచి పేరు ఉందని.. రూ.200 కోట్లతో మణికొండ మున్సిపాలిటీ అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. దయానంద్, ప్రవీణ్, మహేశ్, అభిషేక్, సురేశ్, హరీష్, సాయి ముదిరాజ్, మనోహర్ చారి, సుచి కుమార్ పాల్గొన్నారు.

హెచ్‌బీసీ నుంచి కేబీఆర్ పార్కుకు సైకిల్ రైడ్

రాయదుర్గం : సైకిల్ రైడర్లు సైకిల్ రైడ్‌ను ఉల్లాసంగా, ఉత్సాహంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున గచ్చిబౌలిలోని హెచ్‌బీసీ బై సైకిల్ స్టేషన్ వద్ద ఈ సైకిల్ రైడ్‌ను ప్రారంభించారు. ఎస్కేప్ అండ్ ఎక్స్‌ప్లోర్ టీమ్ పర్యవేక్షణలో ఈ బైసైకిల్‌రైడ్‌ను నిర్వహించారు. హెచ్‌బీసీ బైసైకిల్ స్టేషన్ వద్ద ఆరంభమైన ఈ రైడ్ మైండ్ స్పేస్ జంక్షన్ నుంచి మాదాపూర్ దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి మీదుగా లోటస్‌పాండు, కేబీఆర్ పార్కు వరకు నిర్వహించారు. అనంతరం అక్కడ కొద్దిసేపు సేదతీరిన తర్వాత తిరుగు ముఖంలో అదేమార్గంలో తిరిగి గచ్చిబౌలిలోని హెచ్‌బీసీ బైక్‌స్టేషన్ వరకు ఈ సైకిల్‌రైడ్ కొనసాగింది. ఎస్కేప్ అండ్ ఎక్స్‌ప్లోర్ వ్యవస్థాపకులు అశోక్ మాట్లాడుతూ.. ఆదివారం రోజు ప్రత్యేక సైకిల్‌రైడ్‌ను ఉదయం 5.30 ప్రారంభిస్తారని, ఆసక్తి ఉన్న సైకిల్ రైడర్లు పాల్గొనవచ్చన్నారు. రైడర్లు నేరుగా హెచ్‌బీసీ బైసైకిల్ స్టేషన్‌కు రావొచ్చని, ఇక్కడ సైకిళ్లు సిద్ధంగా ఉంటాయన్నారు. హెచ్‌బీసీ బైసైకిల్ స్టేషన్ నుంచి నగరం, శివారులోని వివిధ ప్రాంతాల వరకు ఈ రైడ్‌లను కొనసాగిస్తామన్నారు.

కూచిపూడి నృత్యప్రదర్శన



మాదాపూర్ : కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం గాయత్రి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ గురువు డాక్టర్ జ్యోతి శేఖర్ శిష్యబృందంచే కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. గణేశ పంచరత్న, జయ జయ దుర్గే, దశావతారం, అంతా రామమయం, మండూకశబ్దం, రామ కోదండరామ, చక్కని తల్లికి, అలరులు కురియగా తదితర అంశాలను కళాకారులు గాయత్రి శేఖర్, ఈషా, షణ్ముక, సహస్ర, వైష్ణవి, నాగమణి, మీనాక్షి, దీప్తి, అన్విత పావని, సిరిఆరాధ్య, కీర్తన, అక్షయ, రిధి, రాధా, సాన్విక, కిన్నెర తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించండి



మాట్లాడుతున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

బండ్లగూడ: రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా గెలిపించి, ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించాలని బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పీరంచెరువులోని లిబ్జం విలాస్‌లో కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తుందని, నాకు ఒక అవకాశం కల్పిస్తే రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా అన్నారు.

శ్రీనివాస్ రెడ్డిని గెలిపించుకుంటాం

అత్తాపూర్: రాజేంద్రనగర్‌లో బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డిని గెలిపించుకుంటామని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం అత్తాపూర్ డివిజన్ యువ మోర్చా అధ్యక్షులు మణికంఠ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్ యాదవ్, యువ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ సూరెడ్డి వినయ్ రెడ్డి, పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో ఉన్న నిరుపేదలకు డబుల్ బెడ్రూమ్‌లు ఇస్తామని నిరాశ మిగిల్చారన్నారు. యువత ఉద్యోగాలు కల్పించడంలోనూ స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారన్నారు. కిరణ్ చారి, నవీన్, సాయి యాదవ్, శ్రీకాంత్ చారి, మ్యాడం రాము, కృష్ణ, రాహుల్ రెడ్డి, మాగాని శివ, అమృత్ కుమార్ పాల్గొన్నారు.

'సాహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కిస్తాం'

సుల్తాన్‌బజార్: విలువ కోల్పోని మన సాహిత్య వారసత్వాన్ని, కాలానుగుణంగా అందివస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమన్వయించి వినూత్న శైలిలో రచనలు చేస్తామని యువ రచయిత్రులు అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన యువ రచయిత్రుల సమ్మేళనంలో రెండవరోజు పలు ఆసక్తికరమైన అంశాలపై చర్చలు జరిగాయి. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీతలు మెర్సీ మార్గరెట్, మానస ఎండ్లూరి, ఆజాదీకా అమృత మహోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన పోటీల్లో తెలంగాణ నుంచి హైదరాబాద్ చరిత్ర గ్రంథానికి బహుమతి పొందిన సుకన్య భువనగిరి, ఇటీవలి కాలంలో తమ అద్భుత రచనలు ప్రచురించి సాహితీ విమర్శకుల ప్రశంసలు అందుకున్న యువ రచయిత్రులు, కవయిత్రులు, ఎస్.లహరి, రక్షిత సుమ, స్ఫూర్తి కందివనం, పల్లె దీక్షిత గౌడ్, రాగలీన, సోనీ కట్కూరి తమ భవిష్యత్తు రచన ప్రణాళికలను పంచుకున్నారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి స్వాగతోపన్యాసం చేస్తూ సాహిత్య వికాసమే ప్రధాన ఆశయంగా కొనసాగుతున్న పరిషత్తు అన్ని భావాలకు వేదికగా నిలుస్తుందన్నదని తెలిపారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య మాట్లాడుతూ.. ఈ సమ్మేళనంలో ప్రతిభ కనబరిచిన కవయిత్రు లు, రచయిత్రుల కోసం మలి విడత అధ్యయన శిబిరం నిర్వహించి తెలంగాణ సగర్వంగా చెప్పుకోగలిగిన సాహితీమూర్తులను తయారు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అధ్యాపకురాలు డాక్టర్ దాసోజు పద్మావతి, బాల సాహితీవేత్త గరిపెల్లి అశోక్ ప్రసంగించారు.

'మనూ'లో ఆజాద్ జయంతి

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఆజాద్‌డే వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం నుంచి ఈనెల 11 వరకు స్వతంత్ర భారత మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలను ఆజాద్ డే వేడుకల పేరిట ఆరు రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించారు. ఫలక్‌నామా సమీపంలోని వట్టేపల్లిలోని 'మనూ' మోడల్ స్కూల్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ అధ్యక్షత నిర్వహిస్తారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ పాల్గొంటారు. 10న ఉదయం 9.30 గంటలకు డీడీఈ ఆడిటోరియంలో ఆజాద్ స్మారక ఉపన్యాసం ఉంటుంది. ఢిల్లీలోని బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సలీల్ మిశ్రా 'మౌలానా ఆజాద్ మేకింగ్ ఆఫ్ మోడర్న్ ఇండియా' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.

'ఐక్యత భావాన్ని పెంపొందించేందుకు సమ్మేళనాలు'

అబిడ్స్: ప్రజల్లో ఐక్యతభావాలు పెంపొందించేందుకు దసరా సమ్మేళనాలు ఎంతో దోహద పడుతాయని మాజీ కార్పొరేటర్ ముఖేష్ సింగ్ పేర్కొన్నారు. గుఫానగర్‌లో జరిగిన లోధ్ సమాజ్ దసరా సమ్మేళన వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. లోధ్ కులస్థుల్లో ఐక్యత భావాలు పెంపొందించేందుకు దసరా సమ్మేళనాలు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ సందర్భంగా లోధ్ సమాజ్ నాయకులు లాల్‌బహదూర్ సింగ్, రాజేష్ సింగ్, నరేందర్‌సింగ్, రితేష్ సింగ్, సంతోష్ సింగ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో 25 వేలకు పైగాలోధ్ కులస్థుల ఓట్లు ఉన్నాయన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు మాజీ కార్పొరేటర్ ముఖేష్ సింగ్‌కు గోషామహల్ బీఆర్ఎస్ టికెట్ ఇస్తే భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. బీజేపీ తరహాలో బీఆర్ఎస్ కూడా లోధ్‌కే టికెట్ ఇవ్వాలన్నారు.

అరుదైన వృక్ష జాతి సంపదకు నిలయం ప్రగతి ఎక్జోటికా



వృక్షాలను పరిశీలిస్తున్న నిర్వాహకులు

శంషాబాద్ రూరల్: దేశ, విదేశాల్లో అరుదుగా కనిపించే వృక్షాలను నగర వాసులకు అందుబాటులోకి తెచ్చినట్లు ప్రగతి ఎక్జోటికా నిర్వాహకులు కుమారస్వామి తెలిపారు. మండలంలోని ముచ్చింతల్ శివారులో ఏర్పాటు చేసిన నర్సరీలో ఆదివారం ల్యాండ్ స్కేప్ నిపుణులు, ఆర్కిటెక్ట్‌తో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆహ్లాదంతో పాటు పచ్చదనం పెంపు కోసం ప్రజలు గృహాలు, ఆవరణలో రకరకాల మొక్కలను పెంచుకోవడానికి ఇష్టపడుతున్నారని తెలిపారు. వారి అభిరుచికి తగ్గట్లు విదేశాల నుంచి అరుదైన వృక్షాలను ఇక్కడ అందుబాటులో పెట్టామని చెప్పారు. రెండేళ్ల నుంచి 400 ఏళ్ల వయస్సు కల్గిన అరుదైన జాతి వృక్షాలు ఇక్కడ లభిస్తాయని పేర్కొన్నారు. ఇండోర్, ఔట్‌డోర్ మొక్కలు, వృక్షాలతో పాటు మొక్కల పెంపకం కోసం వినియోగించే రకరకాల కుండీలు కూడా ఉన్నాయన్నారు.

రూ.9వేల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా !

మియాపూర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ.9 వేలకోట్ల నిధులతో అభివృద్ధి చేశానని, మరోసారి తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అరెకపూడి గాంధీ అన్నారు. మియాపూర్‌లోని మయూరీనగర్ కాలనీవాసులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... 'అభివృద్ధి సంక్షేమం' అనే నినాదంతో శేరిలింగంపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని వివరించారు.

ఓడిన్ స్కూల్‌తో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఒప్పందం

అబిడ్స్: ఓడిన్ స్కూల్‌తో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఓడిన్ స్కూల్ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ విజయ్ పసుపులతి మాట్లాడుతూ.. గణనీయమైన అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఓడిన్ స్కూల్ ప్రారంభించామన్నారు. దేశంలోని అత్యుత్తమ ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సహకరించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఓడిన్ స్కూల్ పట్టభద్రులు ఇప్పుడు జాతీయ ప్రభుత్వ సంస్థచే ధ్రువీకరించబడతారన్నారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పోర్టల్ నుంచి వారి సర్టిఫికెట్లను అందించడం జరుగుతుందన్నారు. ఓడిన్ స్కూల్ విద్యార్థులు వాల్‌మార్ట్, బాష్, ఇన్ఫోసిస్, ఐబీఎం, ఫెడెక్స్, జేపీ మోర్గాన్ మొదలైన కంపెనీల నుంచి పరిశ్రమ అనుభవజ్ఞులతో బోధింపబడుతారన్నారు.

బీజేపీ విజయానికి కృషి చేయాలి



పార్టీలో చేరిన వారితో ఈటల రాజేందర్

మణికొండ: రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేయాలని ఆ పార్టీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం మణికొండ మున్సిపాలిటీకి చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు బీజేపీలో చేరగా వారికి ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీకి పనిచేసిన, గెలిచే అభ్యర్థులకే టికెట్‌లు ఇచ్చామని, వారి గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంజన్‌కుమార్‌గౌడ్, నరేందర్ రెడ్డి, బీరప్ప, సిద్దప్ప, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

అత్తాపూర్ డివిజన్‌లో..

అత్తాపూర్: రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ యువ మోర్చా అధ్యక్షులు మణికంఠ ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరగా వారికి చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లా రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అసమర్థకు ఇది నిదర్శమని.. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా నియోజకవర్గానికి ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఎన్నికలప్పుడు తప్పితే ఎప్పుడూ కనిపించని ఎమ్మెల్యే మాకొద్దని.. అసెంబ్లీలో రాజేంద్రనగర్ సమస్యలపై గళమెత్తని ఎమ్మెల్యే మాకొద్దని ఎద్దేవా చేశారు. ఈసారి ఎన్నికల్లో రాజేంద్రనగర్ బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగిన తోకల శ్రీనివాస్ రెడ్డిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, కిరణ్ చారి, నవీన్, సాయి యాదవ్, అరుణ్, సందీప్, నిఖిల్, కార్తీక్, చెన్నప్ప, రవి, నాగరాజు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో యువతకు ప్రాధాన్యం



పార్టీలో చేరిన యువకులతో బండారి శంకర్

రాజేంద్రనగర్: బీఆర్ఎస్ పార్టీలో యువతకు ప్రాధాన్యం ఎక్కువగా ఉంటుందని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం సీనియర్ నాయకుడు బండారి శంకర్ వెల్లడించారు. శివరాంపల్లి ప్రాంతానికి చెందిన యువకులు ఆదివారం బండారి శంకర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. శంకర్ మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో యువకులు ప్రతి ఓటరు వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని వెల్లడించారు. యువత పార్టీకి ఎంతో ముఖ్యమని.. వారందరికి తగిన ప్రాధాన్యం ఉంటుందన్నారు. సాయిరెడ్డి, రాహుల్ గౌడ్, శ్రీధర్ యాదవ్, అనిల్, సాయి, అరవింద్, సాయి కిరణ్ బీఆర్ఎస్‌లో చేరారు.

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



హఫీజ్‌పేట్ : చందానగర్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠపాలిత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అష్టవింశ 28వ బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటలకు ఉత్సవాస్నపనం, 10.30 గంటలకు జగత్ కల్యాణ నిమిత్తం స్వామివారి మహాకల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు హారతి తీర్థప్రసాదములు భక్తులకు అందించారు. ఒంటి గంటకు అన్నప్రసాద వితరణ చేశారు. శ్రీవారికి బంగారు జరి వస్త్రాన్ని సత్యనారాయణరాజు, ఝాన్సీలక్ష్మీ, స్వామివారి కల్యాణ మూర్తులకు సువర్ణ తాపడ ఆభరణములు సూర్యనారాయణ, నాగ సుజని, దినేష్, సింధు, ఉత్సవ విగ్రహాలకు సువర్ణ తాపహారములు లోహిత సాయిలక్ష్మీ, నాగలక్ష్మి అందించారు. శ్రీవారికి పుష్ప కల్యాణ మండపం ఆలయ కార్యవర్గసభ్యులు శ్రీకాంత్, స్వామివారికి కల్యాణోత్సవం పుష్పాలంకరణ, అన్నప్రసాదవితరణ ఆలయ ప్రధాన కార్యదర్శి సుభాష్, హనుమత్ వాహనసేవ రామకృష్ణశర్మ, బాబు సత్యసాయిలు చేశారు. దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మటన్ కొడతాం.. వంటచేస్తాం

ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు ఓటర్లను తమదైన శైలిలో ప్రసన్నం చేసుకుంటున్నారు. ఓటర్లు చేసే పనులకు సాయం చేసి మరీ ఓట్లు అడుగుతున్నారు. ఆదివారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మటన్‌షాపులో మటన్ కొడుతూ.. క్యాటరింగ్ వారికి సాయంగా వంటచేస్తూ ఓట్లు అభ్యర్థించారు.

-మణికొండ



ప్రచార రథాలకు పూజలు

మణికొండ: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న కస్తూరి నరేందర్‌ముదిరాజ్ తమ ప్రచార రథాలను సిద్ధం చేశారు. మొదటి విడతగా 12 వాహనాలు రావటంతో వాటికి ఆదివారం పూజలు నిర్వహించి మండలాల వారీగా పంపారు. పార్టీ గెలుపునకు ఓ వైపు మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటి ప్రచారం కొనసాగుతుండగా, పలు గ్రామాల పార్టీ నాయకులు, కుల సంఘాల నాయకులు వచ్చి అభ్యర్థి నరేందర్‌ను కలిసి తమ మద్దతు తెలుపుతున్నారు.



పూజలు చేసిన కాంగ్రెస్ నాయకులు